ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూమిని చదును చేసేందుకు వచ్చిన జేసీబీని అడ్డుకుంటున్న విద్యార్థులు

జుట్టుపట్టి.. ఈడ్చుకెళ్లి!

విద్యార్థులపై విరుచుకుపడ్డ పోలీసులు
పండుగపూట అట్టుడికిన హెచ్‌సీయూ

- గుట్టుచప్పుడు కాకుండా 400 ఎకరాలను చదును చేసేందుకు వచ్చిన అధికారులు
- వందలాది పోలీసుల పహారాలో పదుల సంఖ్యలో జేసీబీలతో పనులు మొదలు
- అడ్డుకునేందుకు యత్నించిన విద్యార్థులను గొడ్లను బాదినట్టు బాదిన ఖాకీలు
- 200 మందికిపైగా అరెస్ట్ చేసి ఠాణాల్లో నిర్బంధం
- అరెస్టులను ఖండిస్తూ వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు
- భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : ఉగాది పండుగ పూట హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రణరంగంలా మారింది. వర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూముల్లో ఆదివారం వందలాదిగా మోహరించిన పోలీసులు విద్యార్థులపై లాఠీ దెబ్బలతో విరుచుకుపడి దాదాపు 200 మందిని అరెస్ట్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పండుగ రోజు కావడంతో విద్యార్థులెవరూ బయటకు రారని, తమకు అడ్డుచెప్పేవారు ఎవరూ ఉండరని గుట్టు చప్పుడు కాకుండా టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు జేసీబీలతో పోలీసుల కాపలా నడుమ వర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూముల్లోకి వచ్చారు. దట్టమైన పొదలు, చెట్లను పెకిలించసాగారు. గమనించిన కొందరు విద్యార్థులు అక్కడికి చేరుకునేసరికి పోలీసులు చుట్టుముట్టారు. దొరికినోళ్లను దొరికినట్టే బంధించి వ్యాన్లలోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. ప్రతిఘటించినవారిని లాఠీలతో ఇష్టం వచ్చినట్టు కొట్టారు. పర్యావరణాన్ని దెబ్బ తీస్తూ.. జీవవైవిధ్యానికి నష్టం కలిగించే ప్రయత్నాలు చేయవద్దని నినదిస్తూ అక్కడికి చేరకున్న విద్యార్థులపై పోలీసులు రెచ్చిపోయారు. కాళ్లు, చేతులు పట్టుకొని నేలపై ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించారు. అరెస్టులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని వర్సిటీలో పరిగెత్తిస్తూ మరీ లాఠీలతో చితకబాదారు. 200 మందికి పైగా విద్యార్థులను రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి, కొల్లూరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఠాణాలకు తరలించే క్రమంలో ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పాలని అడిగినందుకు హెల్మెట్లు, ప్రొటెక్షన్ షీల్డ్‌తో విచక్షణా రహితంగా కొట్టారు. కొందరు పోలీసులు తమను బూతులు తిట్టారని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు.

చిరిగిన చొక్కాను చూసుకుంటున్న విద్యార్థి

చిరిగిన చొక్కాతో విద్యార్థి

అరెస్టు అయిన విద్యార్థులను పరామర్శించేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్

బట్టలు చిరిగినా వదలకుండా

పోలీసుల అరాచకాన్ని ప్రశ్నించిన ఆడ పిల్లలను మహిళా పోలీసులు జుట్టుపట్టుకుని నేలపై ఈడ్చుకుంటూ వ్యాను ఎక్కించారు. ఈక్రమంలో పదుల సంఖ్యలో విద్యార్థినులు గాయాలపాలయ్యారు. బట్టలు చిరిగిపోయినా పట్టించుకోకుండా విద్యార్థులను గుంజుకెళ్లారు. ఇతర రాష్ట్రాల వాళ్లు కావడంతో తెలుగు రాదని.. బూతులు తిడుతూ లాక్కెళ్లారు. గాయాలతో రక్తం కారుతున్నా పట్టించుకోకుండా వ్యాన్ ఎక్కించి ఠాణాలకు తరలించారు. అడ్డుకోబోయిన యువకులను కాళ్లు, చేతులు పట్టుకుని వ్యాన్‌లో పడేశారు. పక్కకు నిలబడ్డ కొందరు విద్యార్థులను అకారణంగా లాక్కెళ్లి వ్యాన్ ఎక్కించారు. పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ తోటి విద్యార్థులు వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట బైఠాయించారు. బయటకు రాకుండా నిర్బంధించడంతో అక్కడే కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. 400 ఎకరాల భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, అరెస్ట్ చేసిన విద్యార్థులను వదిలిపెట్టేదాకా అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను లాక్కెళ్తున్న పోలీసులు

విద్యార్థులను లాక్కెళ్లి వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

అరెస్టులను ఖండిస్తూ వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

మాదాపూర్ ఠాణాలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన అరెస్టు అయిన విద్యార్థులు

కాపాడుకునే మాపై దోచుకునేటోళ్ల దాడులా?

జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్న మాపై రాష్ట్రాన్ని దోచుకునే వాళ్లు దాడులు చేయడం సిగ్గుచేటు. వన్య ప్రాణులను కాపాడాల్సిన ప్రభుత్వ బాధ్యతను మాపై వేసుకుని ఉద్యమం చేస్తుంటే పోలీసులను పంపి దౌర్జన్యానికి పాల్పడుతున్నరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48(ఏ) ప్రకారం జీవ వైవిధ్యాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యత. అది వదిలేసి వన్యప్రాణుల ప్రాణం తీసి రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నరు. నిన్నటి నుంచి పోలీసులు యూనివర్సిటీలో మోహరించి మమ్మల్ని ఖైదీల్లా చూస్తున్నరు. ఆడ పిల్లలు అని కూడా చూడకుండా జుట్టుపట్టి లాక్కెళ్తున్నరు. బూతులు తిడుతూ దాడులు చేస్తున్నరు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా 400 ఎకరాల భూమిని, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నం. భూమి కోసం, హక్కుల కోసం పోరాటం చేయడం తెలంగాణ రక్తంలోనే ఉందనేది మర్చిపోవద్దు.

- త్రివేణి, పీహెచ్‌డీ స్కాలర్, జాయింట్ సెక్రటరీ, స్టూడెంట్ యూనియన్

విద్యార్థులకు భయపడే పండుగ రోజు దౌర్జన్యం

రేవంత్‌రెడ్డి నియంతృత్వ పరిపాలనకు హెచ్‌సీయూ విద్యార్థులపై జరిగిన దాడి నిదర్శనం. 400 ఎకరాల భూములను లాక్కోవడానికి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అడ్డుకుంటం. పండుగ రోజు ఎవరూ ఉండరనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కుట్రపూరితంగా మాపై దౌర్జన్యానికి పాల్పడ్డది. మమ్మల్ని దొంగల్లా, రౌడీల్లా ఈడ్చుకెళ్లారు. హాస్టళ్ల లోపలికి చొరబడి ఖైదీలను లాక్కొచ్చినట్టు లాక్కొచ్చి అరెస్ట్ చేసిండ్రు. యూనివర్సిటీలో పోలీసులు భారీగా మోహరించడాన్ని ప్రశ్నించినందుకే మాపై దాడులకు పాల్పడ్డరు. వందలాది మంది విద్యార్థులకు గాయాలైనయి. బట్టలు చిరిగిపోయినయి. మాపై ప్రభుత్వం చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నం. వర్సిటీ పరిధి భూములను హెచ్‌సీయూ పేరిట రిజిస్ట్రేషన్ చేసేదాకా ఆందోళన విరమించేది లేదు.

- ఉమేశ్ అంబేద్కర్, స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్

తెలంగాణలో పోలీసుల అరాచకం

- ప్రభుత్వ అణచివేత తీవ్రమైంది
- ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపే ప్రతి గొంతుకనూ బంధిస్తున్నరు
- ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్‌గాంధీ స్పందించాలి
- మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో ప్రభుత్వ అణచివేత, దమనకాండ విపరీతంగా పెరిగిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ అంశంపై వెంటనే స్పందించాలని ఆదివారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ విధానాలను నిరసించే ప్రతి గొంతునూ బంధిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను కూడా విచ్చలవిడిగా అరెస్టు చేస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. వందలాది ఎకరాల హెచ్‌సీయూ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సెంట్రల్ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో పాటు జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన హక్కును అణచివేస్తున్నారని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అరాచకాలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి పట్టణానికి వెళ్లి ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ గురించి రాహుల్ గాంధీ ఉపన్యాసాలు ఇస్తున్నారని, తెలంగాణలో సొంత పార్టీ పాలనలో జరుగుతున్న అరాచకత్వంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజాస్వామిక పాలన చేసేలా తమ పార్టీకి ఆదేశాలివ్వాలని రాహుల్ గాంధీకి సూచించారు. విద్యార్థులతోపాటు జర్నలిస్టును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల దారుణానికి సాక్ష్యంగా సెంట్రల్ వర్సిటీ

ఎక్స్ ఖాతాలో మండిపడిన హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పోలీసుల దారుణానికి సాక్ష్యంగా నిలిచిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం ఎక్స్ ఖాతాలో హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులను ఉద్దేశించి 'గుంట నక్కలు' అని, 'క్యాంపస్ సమీపంలో భూ ఆక్రమణను వ్యతిరేకిస్తున్నారు' అని సీఎం రేవంత్ చేసిన వాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థుల ఫోన్లు పగులగొట్టి, గొంతులు పిసకడం వంటి చర్యలు చాలా బాధాకరమని వాపోయారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశిస్తూ.. '2016లో మాదిరిగా.. ఇప్పుడు తమరు నిలబడుతారా? లేక మౌనంగా ఉండిపోతారా..?' అని నిలదీశారు. అసమ్మతి అనేది నేరం కాదని, విద్యార్థులకు తప్పకుండా న్యాయం జరిగి తీరాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ ఘటనపై నెటిజన్లు ఫైర్

భూములు గుంజుకున్నోడు చరిత్రలో ఎవడూ గెలవలేదు: రాకేశ్‌రెడ్డి

రాహుల్‌గాంధీ మద్దతుగా నిలుస్తారా..?: ఎమ్మెల్యే పాడి కౌశిక్

ఉగాది రోజున విద్యార్థులకు రేవంత్ గిఫ్ట్: గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి30 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టులను సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ఖండించారు. రేవంత్ సర్కారుపై ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'చరిత్రలో భూములు గుంజుకున్నోడు ఎవడూ గెలవలేదు, భూముల కోసం కొట్లాడినోడే గెలిచాడు. హైడ్రా, మూసి, లగచర్లలో చేదు అనుభవాలు ఎదురైనా కూడా హెచ్‌సీయూ భూములు గుంజుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారంటే.. అసలు మీకు కొంచెం కూడా సిగ్గులేదు. ఇందులో కూడా మీరు ఓటమినే చూస్తారు' అంటూ బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. ' 2016లో నిలబడ్డ తీరుగా రాహుల్‌గాంధీ నేడు హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా నిలుస్తారా? మౌనంగా ఉంటారా?' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. 'విద్యార్థులపై ఎలాంటి ఆదేశాలు లేకుండా పోలీసులు లాఠీచార్జి చేయడం గుండాగిరీని తలపిస్తున్నది' అంటూ జర్నలిస్టు రేవతి పోస్టు చేశారు. 'ఉగాది రోజు హెచ్‌సీయూ విద్యార్థులకు రేవంత్ ఇచ్చిన బహుమతి ఇది. భూములను వేలం వేయొద్దని, 400ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలన్నందుకు విద్యార్థులపైన పోలీసుల జులూం' అంటూ బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. వీరితోపాటు విద్యార్థుల అరెస్టులను ఖండిస్తూ నెటిజన్లు మండిపడుతున్నారు. విద్యార్థి సంఘాల నేతలు, మేధావులు రేవంత్ సర్కారు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టు అరెస్టు అక్రమం: మన్నె క్రిశాంక్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): సౌత్ ఫెస్ట్‌కు చెందిన జర్నలిస్టు సుమిత్ ఝా అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. ఆదివారం సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూవేలానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు అనుకూలంగా రిపోర్టు చేసిన మీడియా ప్రతినిధిని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కాంగ్రెస్ పాలనలో అక్రమ అరెస్టులు పెరిగాయని మండిపడ్డారు. అరెస్టు చేసిన జర్నలిస్టును వెంటనే విడుదల చేయాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు.

నిరసన అంటే ఈ ప్రభుత్వానికి భయమా?: ఎర్రోళ్ల

హైదరాబాద్, మార్చి 30 (నమస్తేతెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులంటే భయమని, ఉగాది పండుగ రోజున విద్యార్థులను అరెస్ట్ చేయడమంటే కాంగ్రెస్ అరాచక పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. పండుగ రోజునే హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యం చేయడం కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన గిఫ్ట్ అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును బలి తీసుకుని 400 ఎకరాలు అమ్మేందుకు ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. విద్యార్థుల గళాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి వెన్నుపోటుగా పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కడమే కాంగ్రెస్ విధానమా? అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన యూనివర్సిటీ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై లాఠీచార్జి దారుణం: తుంగబాలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : హెచ్‌సీయూ విద్యార్థులపై విచక్షణారహితంగా పోలీసులు జరిపిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్‌వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు తెలిపారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కేంద్ర విద్యాసంస్థలకు చెందిన భూములను వ్యాపార ప్రయోజనాలకు వాడటం అనైతికమని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ నయా దేశ్‌ముఖ్ పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థుల భవిష్యత్తును, వారి హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని మండిపడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా వారిని దేశద్రోహుల మాదిరిగా ఈడ్చుకెళ్లడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే యూనివర్సిటీలో విద్యార్థులపై చేసిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషోర్ తెలిపారు.

భూములు అమ్మడానికేనా.. సీఎం వద్ద విద్యాశాఖ

విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తేతెలంగాణ): భూములు అమ్మడానికే రేవంత్‌రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకున్నారా..? అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం యూనివర్సిటీలో భూములను చదును చేస్తున్న జేసీబీలను అడ్డుకోవడానికి వెళుతున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం సరికాదని సూచించారు. ప్రభుత్వ ఏడో గ్యారెంటీ భూములు అమ్మడమేనా..? అని ప్రశ్నించారు.

వర్సిటీలను యుద్ధభూములుగా మార్చొద్దు: ఏబీవీపీ

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీ భూములను కబ్జా చేయడాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) తీవ్రంగా ఖండించింది. సెంట్రల్ వర్సిటీ స్థలంలోకి జేసీబీలను తీసుకువస్తుండగా అడ్డుకున్న ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్, బీ రాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తమ ప్రయోజనాల కోసం వర్సిటీలను యుద్ధభూములుగా మార్చొద్దని ప్రభుత్వానికి ఏబీవీపీ సూచించింది.

'అతిథు'లపై నిషేధం!

మొదటిపేజీ తరువాయి...

సర్క్యులర్ రగడకు దారితీసింది. విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలలు, విభాగాల్లో సదస్సులు, వర్క్‌షాప్‌లు, అతిథి ఉపన్యాసాలు నిర్వహిస్తుంటారు. ఆయా సదస్సుల ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలకు వర్సిటీ అధికారులను అతిథులుగా ఆహ్వానించడం ఆనవాయితీ. అయితే, ఆయా కార్యక్రమాల పోస్టర్లపై అనుమతి లేకుండానే పేర్లు ముద్రించవద్దని, ముందుగా తమ అనుమతి తీసుకోవాలని తాజా సర్క్యులర్‌లో ఆదేశించారు. సదస్సు ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలు గరిష్ఠంగా 45 నిమిషాలు మాత్రమే ఉండాలని నిర్దేశించారు. వేదికపైకి ఎక్కువ మంది అతిథులను ఆహ్వానించడం సరికాదని పేర్కొన్నారు. సదస్సుకు సంబంధించిన ప్రెస్‌నోట్‌ను కేవలం పీఆర్వో ద్వారా మాత్రమే విడుదల చేయాలని, ఒక కాపీని ఐక్యూ ఏసీ విభాగానికి పంపించాలని సూచించారు. ప్రతి కార్యక్రమానికి సంబంధించి ఒక పేజీ వివరణ, జియోట్యాగ్‌తో కూడిన ఫొటోలు తప్పనిసరి అని పేర్కొన్నారు. అతిథులు, ఆహ్వానితుల వివరాలు, సమయం, వేదిక ముందుగానే తమకు తెలియజేయాలని ఆదేశించారు.

గవర్నర్‌కు ఔటా ఫిర్యాదు

ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ తీసుకుంటున్న నిర్ణయాలపై ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అభ్యంతరం వ్యక్తంచేసింది. వీసీ నిర్ణయాలతో యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ బీ మనోహర్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు చేశారు. వర్సిటీ అధ్యాపకులను వీసీ తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. వర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై చాన్స్‌లర్‌గా జోక్యం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే గవర్నర్‌కు లేఖ రాసిన ఔటా ప్రతినిధులు రెండు మూడు రోజుల్లో ఆయనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

లేఖలోని ముఖ్యాంశాలు

- ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రమేశ్‌బాబు పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. దాంతో ఆయన తనను రిలీవ్ చేయాల్సిందిగా వీసీని కోరారు. వారం గడిచినా ప్రొఫెసర్ రమేశ్‌బాబును వీసీ రిలీవ్ చేయకుండా నాన్చుతున్నారు. ఇది పూర్తిగా యూనివర్సిటీ నిబంధనలను ఉల్లంఘించడమే. ఈ విషయమై ఔటా ప్రతినిధులు వీసీని కలిసేందుకు ప్రయత్నించగా ఆయన తిరస్కరించారు. గతంలో ఇలాంటి పదవుల్లో నియమితులైన పలువురు అధ్యాపకులు వర్సిటీ నుంచి రిలీవ్ అయ్యారు.
- వీసీ తన కార్యాలయంలో కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉండటం లేదు. దీంతో అత్యవసర విద్య, పరిపాలన అంశాల్లో నిర్ణయం తీసుకునేందుకు అధ్యాపకులకు ఇబ్బందికరంగా మారింది.
- యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో వీసీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కనీసం సమస్యలు వినేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఈ వైఖరి సమస్యలను తీవ్రతరం చేస్తున్నది.
- వర్సిటీ నియమ, నిబంధనలపై వీసీకి సరైన అవగాహన లేదు. వర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆసక్తి చూపడం లేదు. యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలను నిషేధిస్తూ జారీచేసిన సర్క్యులర్ క్యాంపస్‌లో గందరగోళానికి దారితీసింది.